పశ్చిమగోదావరి,ఏలూరు

వార్త

## పీజీఆర్ ఎస్ ద్వారా అందిన విజ్ఞప్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలి.

ఏలూరు, మార్చ్, 30 ( ప్రభాత వార్త) పీజీఆర్ ఎస్ ద్వారా అందిన విజ్ఞప్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ పీజీఆర్ ఎస్ ద్వారా అందిన విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. పీజీఆర్ ఎస్ ద్వారా అందిన విజ్ఞప్తులు రీఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. సోమవారం పీజీఆర్ ఎస్ లో 289 విజ్ఞప్తులు అందాయి. కార్యక్రమంలో ఇంచార్జ్ డిఆర్ఓ భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేద వర్గాల సొంతింటి కల నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

### త్వరలో లబ్ధిదారులకు పూర్తి చేసి టిడ్కో ఇళ్లు పంపిణీ
### తణుకులో గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాధాకృష్ణ





తణుకు, మార్చి 30 ( ప్రభాత వార్త) : రాష్ట్రంలో పేద, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. సోమవారం తణుకులో ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణం గృహప్రవేశం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో 2.50 లక్షల మంది సొంత గృహ నిర్మాణం పూర్తిచేసే గృహప్రవేశాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. తణుకు నియోజకవర్గంలో ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో సొంత స్థలం ఉన్నవారికి 106 మందికి రూ. 2.50 లక్షలు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. 15వ వార్డులో నందం శ్రీనివాసరావు, అనురాధ దంపతుల ఇల్లు గృహప్రవేశం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే 80 శాతం వారి ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో పేదల ఇళ్లకు సంబంధించి రూ. 1.80 లక్షలు మాత్రమే పి ఎమ్ ఏ వై కింద శాంక్షన్ ఇచ్చిన పరిస్థితి ఉండేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు మరో రూ. 50 వేలు అదనంగా కలిపి అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు కల నెరవేర్చే విధంగా కబటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లను నిర్లక్ష్యం చేసి మధ్యలోనే నిలిపివేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వారికి సైతం ఉపశమనం కల్పించే విధంగా ఇళ్లను తిరిగి పునఃప్రారంభించి లబ్ధిదారులకు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సామాన్యుడికి సొంత ఇంటిని చేకూర్చిన కూటమి సర్కార్



నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం పట్టణంలోని చర్చ్ రోడ్ వద్ద ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 పథకం ద్వారా నిర్మాణమైన గృహాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ లబ్ధిదారునితో కలిసి గృహప్రవేశం చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో కృషి చేస్తోందని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు దశలవారీగా ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. మొదటి విడత కింద 2025 నవంబర్ 12వ తేదీన 3,00,192 ఇళ్లను పంపిణీ చేసిన ప్రభుత్వం, రెండో విడతగా ఈరోజు మరో 2,50,893 ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తోందని వెల్లడించారు. పేదల గృహ కలను సాకారం చేయడం కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించే వరకు తమ కృషి నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారుల జీవితాల్లో స్థిరత్వం, భద్రత కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

# రిటైల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



అత్తిలి, మార్చి 30( ప్రభాతవార్త) అత్తిలి మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షునిగా పమ్మి గోపాలకృష్ణమూర్తి, అధ్యక్షునిగా బెందుకూరి ప్రవీణ్ రాయ్, ఉపాధ్యక్షునిగా డి ఎంజి ప్రసాద్, కార్యదర్శిగా వి. బ్రహ్మాజీ, సహాయ కార్యదర్శులుగా పంజా భరత్ మాతాజీ, జి ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా ఎల్ సూర్యనారాయణ, ఉప కోశాధికారిగా కే వెంకట్రావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు గా జీవి రాఘవులు, దాసం సత్యవతి,ఏ. సత్యనారాయణ, డి. సాయి బాబా, టీఎఫ్ నతానీయేలు,కంప్యూటర్ సహాయకుడిగా ఎన్ వెంకటనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పమ్మి గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాలు, అనారోగ్య కారణాలవల్ల అధ్యక్ష పదవి నుండి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. దీని తో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# పల్లె జీవన వెలుగుకు మొదలైన ప్రగతి రథం

## ప్రతి గ్రామానికి మౌలిక వసతుల కల్పన కూటమి లక్ష్యం - ప్రభుత్వ విప్ నాయకర్



నరసాపురం రూరల్ ప్రభాత వార్త :నరసాపురం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. మొదటగా, సరిపల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 76.93 లక్షల వ్యయంతో నిర్మించిన 60 కిలో లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి త్రాగునీరు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. గతంలో నీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ఇది శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని పేర్కొన్నారు. అనంతరం వేములదీవి వెస్ట్ గ్రామంలో మండల పరిషత్ నిధుల ద్వారా రూ. 15 లక్షల వ్యయంతో నల్లి క్రిక్‌పై నిర్మించిన కాలిబాట వంతెనను మరియు రూ. 13 లక్షలతో హిందూ స్మశాన వాటికకు నిర్మించిన రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కాలిబాట వంతెన నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు సులభమవుతాయని, స్మశాన వాటికకు రహదారి ఏర్పాటు చేయడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో టిడిపి పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

# పిహెచ్సి ని తనిఖీ చేసిన మలేరియా అధికారి



అత్తిలి, మార్చి 30( ప్రభాతవార్త) భీమవరం అసిస్టెంట్ మలేరియా అధికారి వై.నాగబాబు అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు తెలియజేయాలని కోరారు. ప్రస్తుత వేసవి సీజన్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జ్వరాలు వచ్చిన పేషెంట్లకు వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు.మలేరియా రాపిడ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ కి సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏలూరుపాడు కోట రామాలయం వద్ద అన్న సమారాధన



కాళ్ళ మార్చి 30 (ప్రభాతవార్త) : మండలంలోని ఏలూరుపాడు కోట రామాలయం వద్ద 52వ వార్షిక శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అడపా వెంకటేశ్వరరావు-దుర్గాభవాని దంపతులచే కళ్యాణ్ మహోత్సవ నిర్వహించారు. . మేళ తాళాలు, విచిత్ర వేషాలు, పల్లకి తో స్వామి వారి ఊరేగింపుతో వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం జరిపారు.. దాతలు గ్రామస్తులు భక్తుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తలగళ్ల వెంకటేశ్వరరావు, తలగళ్ల బ్రహ్మారావు, తోరం నరేంద్రలు తెలిపారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన వారికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# చాట్రాయి మండలంలో విద్యుత్ బకాయిలు 16 కోట్లు



చాట్రాయి, మార్చి 30, ప్రభాతవార్త : చాట్రాయి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలనుండి చెల్లించవలసిన విద్యుత్ బకాయిలు 16 కోట్లు పైచిలుక ఉన్నట్లు ట్రాన్స్ కో ఎఇ సంజయ్ చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్నిటికి కరెంట్ కట్ చేయడంతో బకాయిల వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాట్రాయిలో 13 ప్రభుత్వ కార్యాలయాలకు గాను రెండు కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఆరుగొలనుపేట గ్రామంలో 9 సర్వీసులకు గాను 62 లక్షలు, బూరుగు గూడెంలో 11 సర్వీసులకు గాను 60 లక్షలు, చీపురుగూడెంలో 16 సర్వీసులు గాను 91 లక్షలు, చిన్నంపేటలో 12 సర్వీసులు గాను 66 లక్షలు, చిత్తపూరులో 25 సర్వీసులు గాను 57 లక్షలు,గుడిపాడు లో 6 సర్వీసులకు గాను 40 లక్షలు, జనార్దనవరం లో 6 సర్వీసులకు గాను కోటి అయిదు లక్షలు, జయపురం లో నాలుగు సర్వీసులు గాను 11 లక్షలు, కోటపాడు లో 21 సర్వీసులకు గాను 91 లక్షలు, కొత్తగూడెంలో 9 సర్వీసులు గాను 48 లక్షలు, కృష్ణారావు పాలెం లో ఏడు సర్వీసులు గాను 34లక్షలు, మంకొల్లులో రెండు సర్వీసులు గాను 13 లక్షలు, మర్లపాలెం లో 18 సర్వీసులు గాను 95 లక్షలు, పర్వతాపురంలో 7 సర్వీసులు గాను 35 లక్షలు, పోలవరంలో 17 సర్వీసులు గాను కోటి 24 లక్షలు, పోతనపల్లి లో 17 సర్వీసులు గాను 90 లక్షలు,సోమవరంలో 8 సర్వీసులకు గాను 60లక్షలు, చనుబండ లో 21 సర్వీసులకు గాను 76 లక్షలు,తుమ్మగూడెంలో 12 సర్వీసులకు గాను 70 లక్షలు,యర్రవారిగూడెం లో 1 సర్వీసు కు గాను 17 లక్షలు,నరసింహారావుపాలెం లో 17 సర్వీసులకు గాను 88 లక్షలు,సి. గుడిపాడు లో 9 సర్వీసులకు గాను 45 లక్షలు,సూరంపాలెం లో 19 సర్వీసులకు గాను 58 లక్షలు బకాయిలు ఉన్నట్లు ఆయన వివరించారు.

# చిగురుమామిడిలో అగ్ని ప్రమాదం

వేలేరుపాడు మార్చి30 (ప్రభాత వార్త ) : వేలేరుపాడు మండలంలోని చిగురుమామిడి గ్రామంలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక గృహానికి మంటలు అంటుకొని భారీగా మంటలు ఎగిసి పడటంతో చుట్టుపక్కల ఉన్న మరో మూడు గృహాలకు మంటలు వ్యాపించాయి.ఈ ప్రమాదంలో చంద్రుగొండ సత్తిబాబు, చిన్న నరసింహులు, ఎక్కిల శ్రీను, రింగ్ బాబు లకు చెందిన నాలుగు గృహాలు పూర్తిగా కాళీ బూడిదైనాయి.ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పినప్పటికీ ఆస్థి నష్టం భారీగా జరిగింది. ఇంట్లో ఉన్న సామాగ్రితో పాటు వస్త్రాలు నగదు ఆభరణాలు పూర్తిగా కాలి బూడిదైనాయి. అన్ని పూరిళ్లు కావడంతో గృహాల్లో ఉన్న ప్రతి వస్తువు కాలి దగ్ధమై నిలువు నీడ లేకుండా పోయింది. బాధితులను ప్రభుత్వం త్వరితగతిన ఆదుకోవాలని చిగురుమామిడి గ్రామస్తులు అధికారులను కోరారు.



# దేశంలోనే దూరదృష్టి కలిగిన నేత చంద్రబాబు

### పి4 విధానంతో పేదల కుటుంబాల్లో వెలుగులు
### మార్గదర్శి బంగారు కుటుంబం అవార్డులు అందించిన ఎమ్మెల్యే




తణుకు , మార్చి 30 (ప్రభాత వార్త ): దేశంలో ఏ నాయకుడికి లేని దూరదృష్టి చంద్రబాబు నాయుడు అవలంబిస్తున్న తీరును ప్రతి ఒక్కరు స్వాగతించాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. దాదాపు 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగి అధికార పక్షంలో అయినా, ప్రతిపక్షంలో అయినా ప్రజల పక్షాన పోరాడుతున్న నేత చంద్రబాబు నాయుడు అని అన్నారు. సోమవారం తణుకులోని స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పి4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శి బంగారు కుటుంబం స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో సహకారం అందిస్తున్న పలువురు దాతలను రాధాకృష్ణ సత్కరించి జ్ఞాపకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాధాకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హైదరాబాదులో హైటెక్ సిటీ నిర్మాణం చేస్తే ఆనాడు ప్రతిపక్ష నాయకులు విమర్శించారని గుర్తు చేశారు. ప్రస్తుతం సైబరాబాద్ నగరం విశ్వవ్యాప్త నగరంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రజలను భాగస్వాములు చేస్తూ చేపట్టిన ఎన్నో కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతం అయ్యాయని చెప్పారు. పేదరిక నిర్మూలనలో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల కుటుంబాలను ఆర్థికంగా చేయూత అందించేందుకు చంద్రబాబు నాయుడు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని అన్నారు. పి4 విధానం ద్వారా ప్రభుత్వంలో భాగస్వాములై ఎంతోమంది దాతృత్వంతో చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే రాధాకృష్ణ అభినందించారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు తణుకు నియోజకవర్గంలో అందించడానికి ముందుకు వస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం తణుకు పట్టణానికి చెందిన మాజేటి ప్రకాష్ ఒక కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు అందిస్తున్న 12 మంది దాతలకు అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రంగనాథరాజుకు చినమిల్లి పరామర్శ



భీమవరం టౌన్, మార్చి 30 : ప్రభాతవార్త : మాజీ మంత్రి ఆచంట వైసిపి ఇన్చార్జి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు తండ్రి నరశింహారాజు స్వర్గస్థులు కావటంతో భీమవరం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జి చినమిల్లి వెంకట్రాయుడు సోమ వారం యండగండి గ్రామంలో ఆయన నివాసానికి వెళ్ళి దివంగత నరశింహారాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఆనంతరం శ్రీరంగనాద రాజును పరామర్శించారు. భీమవరం పట్టణ అధ్యక్షులు గాదిరాజు రామరాజు వైఎస్ఆర్ సీపీ సోషల్ మీడియా జిల్లా ప్రెసిడెంట్ బంధన పూర్ణచంద్రరావు, మరియు పోతురాజు, వెంకట్ నాయుడు, యాళ్ళ క్రాంతికుమార్, బొబ్బిలి లక్ష్మణ్ కార్తీక్ మరియు వైసిపి మిత్రులు. కార్యకర్తలు అభిమానులు వారి వెంట ఉన్నారు.

# ముగిసిన శ్రీరామనవమి వేడుకలు



మొగల్తూరు మార్చి 30 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కేపీ పాలెం నార్త్ గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ కోదండ రామాలయం నందు సోమవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ముగిసాయి, ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీఅఖండ అన్న సమారాధన నిర్వహించారు, ఈ అన్న సమారాధనకు భక్తులు పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి అన్న సమారాధన స్వీకరించారు

# మానవత ఆధ్వర్యంలో ఉగాది పురస్కార గ్రహీత యేసురాజుకు సత్కారం



పెనుమంట్ర, మార్చి 30, (ప్రభాతవార్త) : మండలంలోని మార్టేరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉగాది పురస్కార గ్రహీత యివ్వాల యేసురాజును సోమవారం ఘనంగా సత్కరించింది. సంస్థ అధ్యక్షులు సిరం విశ్వనాథం ఆధ్వర్యంలో జరిగిన సభకు సత్యవరం కో-పరేటివ్ సొసైటీ అధ్యక్షులు మైగాపుల రాము ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉన్నతమైన సేవలు అందిస్తూ, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడమే మానవత సంస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. మానవతా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన రంకిరెడ్డి రామ్మోహనరావు మాట్లాడుతూ, నేటి విద్యార్థులకు ఆధ్యాత్మిక ధోరణి ద్వారా నైతిక విలువలు, క్రమశిక్షణ అలవడతాయని, అది నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం గర్వకారణం అన్నారు. శ్రీ పరాభవ ఉగాది పురస్కారం-2026 గ్రహీత యివ్వాల యేసు రాజు మాట్లాడుతూ మార్టేరు గ్రామం నుండి గతంలో పడాల ప్రహ్లాద రెడ్డి, మీరా ప్రసాద్ వంటి వారు అవార్డులు పొందారని, ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా స్టేట్ అవార్డు తీసుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

**పేద విద్యార్థికి ఆర్థిక సహాయం:**

సేవా దృక్పథంతో తాడికొండ నందిని అనే పేద విద్యార్థికి చదువు నిమిత్తం రూ. 10,000 ఆర్థిక సహకారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సెక్రెటరీ బండి ప్రసాద్, ట్రెజరర్ అమృత వాక్కుల సత్యనారాయణ, చైర్మన్ కదలి సుబ్రమణ్యం, జిల్లా ప్రతినిధి కొత్త సత్యనారాయణమూర్తి, పడాల జగన్నాథ్ రెడ్డి, చిర్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువతిపై వేధింపులు: ముగ్గురు యువకులకు 12 రోజుల రిమాండ్

కామవరపుకోట,మార్చి 30(ప్రభాత వార్త):: వివాహానికి సిద్ధమైన ఓ యువతిని బెదిరించి, దాడికి యత్నించిన ముగ్గురు యువకులను తడికలపూడి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఎస్ఐ చిన్నారావు తెలిపిన వివరాల ప్రకారం.. కామవరపుకోట గ్రామానికి చెందిన ఓ యువతికి త్వరలో వివాహం నిశ్చయమైంది. అయితే అదే గ్రామానికి చెందిన ఎస్.రాజకుమార్, పి.కిషోర్ బాబు, జి.అభిలాష్ అనే ముగ్గురు యువకులు ఆమెను అడ్డుకుని, "నన్ను తప్ప వేరెవరినీ పెళ్లి చేసుకోకూడదు" అంటూ పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారు.అంతటితో ఆగకుండా యువతి ఇంటికి వెళ్లి దాడికి ప్రయత్నించడంతో భయాందోళనకు గురైన బాధితురాలి కుటుంబ సభ్యులు తాడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి 12 రోజుల రిమాండ్ విధించింది.

# పి 4లో బంగారు కుటుంబాల సేవ ఎనలేనిది





నరసాపురం ప్రభాత వార్త : నరసాపురం పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో పి 4 మొదటి వార్షికోత్సవంలిలి ఘనంగా నిర్వహించబడిన కార్యక్రమంలో భాగంగా నరసాపురం నియోజకవర్గంలో బంగారు కుటుంబాలకు అందించిన సేవలను గుర్తించి మార్గదర్శకులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో సేవా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పి 4 కార్యక్రమం గత సంవత్సరం కాలంలో ప్రజలకు ఉపయోగకరమైన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి గుర్తింపు సాధించిందని అన్నారు. ముఖ్యంగా బంగారు కుటుంబాల అభ్యున్నతికి చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమం మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ ఇంచార్జ పొత్తూరి రామరాజు, జనసేన, టిడిపి, బిజేపి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

# రోడ్డు ఆక్రమించి ప్రహరీ నిర్మాణం
## - పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు

చాట్రాయి, మార్చి 30, ప్రభాతవార్త : రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపట్టారని దీనివల్ల వాహన రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో జరిగిన పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేశారు. వివరాలు ప్రకారం చాట్రాయి మండలం, చనుకొండ శివారు సూరంపాలెం ఎస్సీ కాలనీలోకి వెళ్లే రోడ్డులో గుడుమెళ్ళ బ్రహ్మయ్య రోడ్డు ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేస్తున్నారని కాలనీకి చెందిన మర్సకట్ల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. తక్షణమే నిర్మాణపు పనులు నిలిపివేయించాలని లేని పక్షంలో ఈ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గానీ, మా ఇళ్లకు వెళ్లాలన్నా దారి లేని పరిస్థితి ఏర్పడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**చిన్నంపేటలో**

మండలంలోని చిన్నంపేట గ్రామ సచివాలయంలో మరుగుదొడ్డి




నిర్మాణం చేయాలని కోరుతూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి రాజుకు సిపిఐ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, తెలుగుదేశం పార్టీ నాయకులు కొమ్ము సుజనరావులు అర్జీ సమర్పించారు.

# జాస్తి శ్రీనివాసరావును పరామర్శించిన ఎమ్మెల్యే రోషన్

లింగపాలెం మండలం మార్చి 30 ప్రభాతవార్త : పటంగూడెం గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన జాతీయ శ్రీనివాసరావు తల్లి జాస్తి రాజేశ్వరి పెద్ద కార్యానికి హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్. లింగపాలెం మండలం మఠంగూడెం లొ ఇటీవల స్వర్గస్తురాలైన జాస్తి శ్రీనివాస రావు తల్లి గారు జాస్తి రాజేశ్వరి పెద్ద కార్యానికి హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ గారు, ఆయనతోపాటు మండల



నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంధకారంలో ప్రభుత్వ కార్యాలయాలు
## -బిల్లు కట్టకపోవడంతో కరెంట్ కట్

చాట్రాయి, మార్చి30, ప్రభాతవార్త : చాట్రాయి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలని అంధకారంలోకి వెళ్లాయి. కరెంట్ బిల్లు కట్టకపోవడంతో విద్యుత్ అధికారులు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కరెంటు లేకుండా చేశారు. మండలంలో ఉన్న గ్రామ సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం తో సహా కరెంటు లేని పరిస్థితి ఏర్పడింది. ఒక్కొక్క కార్యాలయానికి లక్షల్లో బిల్లులు పెండింగ్ ఉండటంతో మార్చి నెల ఆఖరి కల్లా కట్టాలని విద్యుత్ అధికారులు హుకుం చేశారు. కార్యాలయాలకు రావలసిన కంటింజెంట్ అమౌంట్ రాకపోవడంతో బిల్లులు కట్టలేక పోతున్నట్టు తెలుస్తోంది. కరెంటు లేకపోవడంతో కార్యాలయాల్లో కంప్యూటర్ లు పనిచేయక పని కూడా ఆగిపోయింది. ఈ విషయంపై విద్యుత్తు అధికారులను ప్రశ్నించగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకే కరెంటు



కట్ చేసినట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ కార్యాలయాల్లో కరెంటు బిల్లులు పెండింగ్ ఉండడం ప్రజలకు శాపంగా మారిందని పలువురు అంటున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు కరెంట్ బిల్లు పైకాన్ని జమ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# దళారీ వ్యాపారుల దెబ్బకు మొక్కజొన్న రైతు చిత్తు కానున్నారా?
## - దళారీ వ్యాపారులు సిండికేట్
## - కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలంటూ రైతులు వినతి

ప్రభాతవార్త చాట్రాయి : మొక్కజొన్న చేతికి వస్తుండగా దళారీ వ్యాపారులు ధరను తగ్గిస్తూ రైతులను మోసం చేసే పనిలో పడ్డారు. పంట చేతికి వచ్చింది ధర కూడా అనుకూలంగా ఉందని రైతులు ఆనంద పడుతున్న తరుణంలో ధర చేజారి పోతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మొక్కజొన్న క్వింటాళ్లు 2,400 రూపాయలు వరకు పలకగా ప్రస్తుతం దళారులు మాత్రం 1600 కి రైతులు వద్ద నుండి వ్యాపారులు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మొక్కజొన్నకు డిమాండ్ ఉన్నప్పటికీ రైతుల అవసరాలను దళారీ వ్యాపారులు ఆసరాగా తీసుకుని మోసం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చాట్రాయి మండలంలో మొక్కజొన్న సాగు అధికంగా ఉంటుంది. సార్వా సాగు పూర్తి కావడంతోనే రెండో పంటగా మొక్కజొన్న ను రైతులు ఎంచుకుంటారు. దీంతో చాట్రాయి మండలంలో సుమారు 15 వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు ఉంటుంది. రైతులు ఇప్పుడిప్పుడే మొక్కజొన్న పంట చేతికి రావడంతో కాటాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం దళారీ వ్యాపారులపై సిండికేట్ సీక్రెట్ పై దృష్టి సారించకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులను కళ్ళముందే మోసం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు ఎకరానికి కౌలు కట్టి పంట పండిస్తే దళారి వ్యాపారులు మోసానికి



గురి కావాల్సి వస్తోందని రైతులు విలపిస్తున్నారు. మొక్కజొన్నకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చిందని ధర కూడా సక్రమంగా గిట్టుబాటు కాకపోతే నష్టపోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొక 15 రోజుల్లో మొక్కజొన్న పూర్తిగా చేతికి వచ్చే అవకాశాలు ఉన్నాయని ధర మరింత తగ్గిస్తారని ఆందోళనలో రైతులు ఉన్నారు. వ్యవసాయశాఖ అధికారులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలని రైతులకు మేలు చేయాలని రైతుల కోరుతున్నారు.

**వ్యవసాయ అధికారి వివరణ**

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు గురించి చాట్రాయి మండల వ్యవసాయ అధికారి శివశంకర్ ను ప్రభాతవార్త వివరణ కోరగా ప్రభుత్వానికి కొనుగోలు కేంద్రం అవసరం పై నివేదిక పంపామని అనుమతి రాగానే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు.

# కాళ్ళకూరు వెంకన్నకు హస్తకళా పెయింట్

కాళ్ళ మార్చి30 (ప్రభాతవార్త) : స్వామివారి శంఖు చక్ర నామములు గరుత్మంతునితో ఉన్న తంజావూరు హస్తకళ ( పెయింట్స్) చిత్రపటాన్ని దాతలు బహుకరించడం అభినందనీయమని దేవస్థాన పాలక మండలి అధ్యక్షుడు అడ్డాల వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామివారికి ఉండి మండలం చినపుల్లేరుకు చెందిన బొర్రా వెంకన్న సత్యవతి దంపతుల కుమారుడు శ్రీనివాస్ జాహ్నవి రూ: 1,08,500/-(లక్ష ఎనిమిది వేల ఐదువందల) విలువగల ప్రముఖ తంజావూరు హస్తకళ ( పెయింట్స్ ) శ్రీ స్వామివారి శంఖు చక్ర నామములు గరుత్మంతునితో ఉన్న చిత్రపటాన్ని



ఆశీర్వచనం అందజేశారు. తంజావూరు హస్తకళా పెయింట్ అందజేసిన దాతలకు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అడ్డాల వెంకట శివ రామరాజు, ధర్మకర్తలు, కార్యనిర్వహణాధికారి మోకా అరుణకుమార్, ఆలయ సిబ్బంది, అర్చకులు అభినందనలు తెలిపారు.

# విద్యుత్ సేవల్లో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలో మూడో స్థానం
## -జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

భీమవరం మార్చి 30 ప్రభాతవార్త : జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం మంత్రి భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి విశాఖపట్నంలో ఉన్న ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజతో గూగుల్ మీట్ ద్వారా విద్యుత్ శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యుత్ శాఖ అధికారి పి. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలు, లో వోల్టేజీ సమస్యలు, నూతన సబ్ స్టేషన్లు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లు,




వినియోగదారుల స్పందన వంటి అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. భీమవరంలో ఎస్సీ, ఎస్టీ గృహాలకు సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుపై ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సోలార్ విద్యుత్ అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా వోల్టేజీ సమస్యలు లేకుండా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శాసనసభ్యుల నుంచి వస్తున్న నూతన సబ్ స్టేషన్ల ప్రతిపాదనలపై ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ఒక నెల ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలో విద్యుత్ సేవలను మరింత మెరుగుపరచి ప్రజల నుంచి 100 శాతం సానుకూల స్పందన సాధించే దిశగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

# సోలార్ విద్యుత్ తో మనమే ఉత్పత్తి చేసుకోవచ్చు :మంత్రి గొట్టిపాటి

భీమవరం మార్చి 30,ప్రభాతవార్త : సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గృహాలకు అవసరమైన విద్యుత్ మనమే ఉత్పత్తి చేసుకోవచ్చు అని జిల్లా ఇంచార్జ్ మంత్రి మరియు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.సోమవారం కొవ్వాడ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ గృహాలపై సోలార్ విద్యుత్ యూనిట్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం కింద కొవ్వాడ గ్రామంలో ఎస్సీ లబ్ధిదారుల గృహాలకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. నేటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి నాటికి ప్రతి నియోజకవర్గంలో కనీసం 2,000 సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గృహాలపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం గణనీయమైన సబ్సిడీ అందిస్తున్నదని మంత్రి వెల్లడించారు. 2 కిలోవాట్ల సామర్థ్యానికి రూ. 60,000 వరకు సబ్సిడీ, 3 కిలో వాట్ల సామర్థ్యానికి



రూ. 78,000 వరకు సబ్సిడీ సోలార్ యూనిట్ ఏర్పాటు చేయాలనుకునే లబ్ధిదారులకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే ప్యానెల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తును వినియోగించుకుని, మిగిలిన విద్యుత్తును ప్రభుత్వానికి విక్రయించవచ్చని మంత్రి వివరించారు. డిస్కంలు యూనిట్‌కు రూ. 2 కు పైగా ధరకు కొనుగోలు చేస్తాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి పెట్టి, పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, పీఎం సూర్య ఘర్ పథకం కింద త్వరలోనే వ్యవసాయ కనెక్షన్లకు రోజుకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సోలార్ విద్యుత్ రంగానికి పెద్దపీట వేశారని తెలిపారు. మొదటగా గుజరాత్‌లో ప్రారంభమైన సోలార్ కార్యక్రమాలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా విస్తరించాయని వివరించారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ సబ్సిడీలను అందిస్తున్నాయని ఆయన చెప్పారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును గృహ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు, మిగులు విద్యుత్తును గ్రిడ్‌కు పంపించి ఆదాయం పొందవచ్చని తెలిపారు. మిగులు విద్యుత్తుకు యూనిట్‌కు సుమారు రూ. 2.06 చెల్లింపు జరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థ దేశంలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం శాసనసభ్యులు మరియు పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత, జిల్లా విద్యుత్ శాఖ అధికారి పులి ఉషారాణి, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రూ 2.60 కోట్లతో నిర్మించిన వాటర్ ట్యాంకర్ ప్రారంభం

నరసాపురం రూరల్ ప్రభాత వార్త : నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. మంగళగుంటపాలెంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి భవనాన్ని జిల్లా పరిషత్ నిధుల ద్వారా రూ. 7 లక్షల వ్యయంతో పూర్తి చేసి ప్రారంభించారు. అలాగే రుస్తుంబాద గ్రామంలోని ఏ ఎం నగర్‌లో మండల పరిషత్ నిధులతో రూ. 18 లక్షల వ్యయంతో నిర్మించిన సౌకర్యవంతమైన ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని కూడా ప్రారంభించారు. అదేవిధంగా జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ. 2.06 కోట్ల వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అంగన్వాడి భవనం అసంపూర్తిగా ఉండటంతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే నిధులు కేటాయించి భవనాన్ని పూర్తి చేయించామని పేర్కొన్నారు. ఏ ఎం నగర్ ప్రాంత ప్రజలకు కమ్యూనిటీ భవనం సామాజిక కార్యక్రమాలు, సమావేశాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన వాటర్ ట్యాంక్ వల్ల రుస్తుంబాద గ్రామంతో పాటు సీతారామపురం సౌత్, సీతారామపురం నార్త్ మరియు రాజుగారితోట గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన, టిడిపి, బిజేపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

# వేగవరం పంచాయతీ పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు

జంగారెడ్డిగూడెం రూరల్ ప్రభాత వార్త మార్చి 30 : జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగిసిన సందర్భంగా సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి విశేష సేవలందించిన సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులను గ్రామ పెద్దలు, సిబ్బంది ఘనంగా సన్మానించారు గ్రామ సర్పంచ్ లక్కబత్తుల నాగరాజు, ఉప సర్పంచ్ అనిశెట్టి వెంకటేశ్వరావుతో పాటు వార్డు సభ్యులు కుక్కల మాధవరావు, లక్కబత్తుల వెంకటరమణ, నాగరాజు, విజయనందం తదితరులకు పూలదండలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.



రాజకీయాలకు అతీతంగా వేగవరం సొసైటీ అధ్యక్షుడు మరియు టిడిపి గ్రామ అధ్యక్షుడు ఆలపాటి దుర్గారాం ప్రసాద్, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు అనిశెట్టి శ్రీను, కాంగ్రెస్ నాయకుడు అట్లూరి శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధి కోసం పాలకవర్గం చేసిన కృషిని వారు కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో వారు చూపిన చొరవను గుర్తుచేసుకున్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ, తమ పదవీకాలంలో సహకరించిన అధికారులకు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అల్లం చర్ల రాజుపాలెంలోఅక్రమ మట్టితవ్వకాలు ఆపాలి
## చెరువుల ఆక్రమణలు ఆపాలి...

టి.నరసాపురం మార్చి 30 ప్రభాతవార్త : మండలంలోనిఅల్లంచర్ల రాజుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు, ఆక్రమణలను అరికట్టి, భవిష్యత్తులో ముంచుకొస్తున్న తీవ్ర నీటి ఎద్దడి నుండి గ్రామాన్ని కాపాడాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి తాటిగడప జయరాజు జంగారెడ్డిగూడెం ఆర్డీవోకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లంచర్ల రాజుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 10 చెరువులు ఈదుల చెరువు, మల్లుకుంట చెరువు, రాజకట్ట చెరువు, జంగాల కుంట, తదితర చెరువులు గ్రామ వ్యవసాయానికి, భూగర్భ జలాల వృద్ధికి అత్యంత కీలకం. కానీ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం ఈ చెరువుల మనుగడ తీవ్ర ప్రమాదంలో పడిందనీ జయరాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువుల భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టి మాఫియా అక్రమంగా మట్టిని తరలిస్తోందన్నారు. చెరువుల పక్కన ఉన్న భూస్వాములు, రైతులు ఉద్దేశపూర్వకంగా సదరు చెరువుభూములనుఆక్రమించుకొని, ఆ స్థలంలో మొక్కజొన్న తదితర వ్యవసాయం సాగుచేస్తున్నారన్నారు. కాలువల ప్రవాహాన్ని అక్రమంగా మూసివేయడం వల్ల వర్షాకాలంలో కూడా చెరువుల్లోకి నీరు చేరడం లేదున్నారు. చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి అన్నారు. ఆక్రమణలు, మట్టి పూడిక వల్ల చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయి, భూగర్భ జలాలు అడుగంటిపోతాయన్నారు. రాబోయే కాలంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడి, పంట పొలాలకు సాగునీరు అందక రైతాంగంజీవనాధారంకోల్పోతుందన్నారు. గ్రామ ప్రజలకు తాగునీరు, పశువులకు కనీస అవసరాలకు కూడా నీరు దొరకని భయంకరమైనపరిస్థితితలెత్తుతుందన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, భవిష్యత్ తరాల మనుగడకు మరియు ప్రజాప్రయోజనాలకు తీవ్ర భంగం కలుగుతుందన్నారు. కావున, భవిష్యత్తులో జరగబోయే ఈ అనర్థాలను దృష్టిలో ఉంచుకుని, దయచేసి వెంటనే రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ మరియు



పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలోపరిశీలనజరిపించవలసిందిగాకోరుతున్నామన్నారు .అక్రమణలను తక్షణమే తొలగించి, మట్టి తవ్వకాలను నిలిపివేసి, ఈ చెరువులను భవిష్యత్ తరాల కోసం శాశ్వతంగా పరిరక్షించాలని ప్రార్థిస్తు నామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# నూతన చట్టాలపై అవగాహన సదస్సు

ఆగిరిపల్లి మార్చి 30 ప్రభాతవార్త జిల్లా పోలీసు యంత్రాంగం పౌరులకు నూతన శిక్షా స్మృతిపై అవగాహన కల్పించే దిశగా కీలక అడుగులు వేస్తోంది స్థానిక ఎస్సై కె శుభసేఖర్ పేర్కొన్నారు. నూజివీడు రూరల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ యొక్క ఆధ్వర్యములో. ఆగిరిపల్లి ఎస్.ఐ శుభశేఖర్ మరియు సిబ్బంది సోమవారం మండలంలోని ఈదులగూడెంలోఅవగాహన కార్యక్రమమును నిర్వహించినారు. అనంతరం ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ ప్రధాన కూడలి లో జరిగిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాల గురించి ప్రజలకు మరియు ప్రయాణి కులకు వివరించారు. బి.ఎన్.ఎస్ యాక్ట్ ఇది పాత భారతీయ శిక్షా స్మృతి స్థానంలో వచ్చిన కొత్త చట్టం. ఇందులో శిక్షల కంటే బాధితులకు న్యాయం చేకూర్చ డానికి, నేరాల




నిర్వచనాల్లో స్పష్టతకు ప్రాధాన్యతనిచ్చారనీ అన్నారు. మహిళలు , చిన్నారులపై జరిగే నేరాలకు కఠిన శిక్షలు అమలు చేయ బడతాయి. .బి.ఎన్.ఎస్.ఎస్ ఇది పాత నేర విచారణ ప్రక్రియ స్థానంలో అమల్లోకి వచ్చింది. కేసుల విచారణలో వేగం, పారదర్శకత కోసం సాంకేతికతను వీడియో గ్రాఫీ, ఆన్‌లైన్ సాక్ష్యాలు వినియోగించడం ఈ చట్టం ప్రత్యేకత అని వివరించారు. సామాన్యులకు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగే పని లేకుండా నిర్ణీత కాల వ్యవధిలో న్యాయం అందేలా ఈ చట్టం రూపొందించ బడిందనీ తెలిపారు. సాంకేతిక వినియోగం ఎఫ్.ఐ.ఆర్ నమోదు నుండి విచారణ వరకు అన్నీ డిజిటలైజ్ చేయబడు తున్నాయని తెలిపారు. త్వరితగతిన న్యాయం ఈ మార్పుల వల్ల కోర్టు కేసులు త్వరగా పరిష్కారమ వుతాయని, బాధి తులకు సత్వర న్యాయం లభిస్తుందని వివరించారు. చట్టంపై అవగాహన కలిగి ఉండటం బాధ్య తాయుతమైన పౌర లక్షణం. నూతన చట్టాల అమలులో పోలీసులకు సహక రించండి అని పిలుపు నిచ్చారు.